# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





# లైఫ్ మేనేజ్ మెంట్

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

రాకింగ్ చైర్ విసురుగా ఊగుతోంది ముందుకీ, వెనక్కీ. మరే లైటు వెలగని ఆ గదిలో పక్కన ఉన్న టేబిల్ లాంప్ వెలుగులో ఆ కుర్చీ నీడ పెద్దదిగా, చిన్నదిగా పడుతూ సాగుతోంది వెనక గోడమీద.

అతను అలా ఆ కుర్చీలో అప్పటికి దాదాపు అరగంట నించీ కూర్చుని ఉన్నాడు. ఏం చెయ్యాలో తెలియనట్టు, ఏమి జరుగుతోందో అర్థం కానట్టు గజిబిజి గా ఉంది అతనికి. అతని చేతిలో ఉన్న అత్యాధునికమైన ఫోన్ లో అతన్ని వెక్కిరిస్తున్న మెసేజ్. కూతురు తన్వి దగ్గరనుంచి.

"నాన్నా, నేను వెళ్ళిపోతున్నాను, నా మెడికల్ స్కూల్ ఇక్కడకి దగ్గర, మీ దగ్గరుండి చదువుకోమని మీరు అడిగితే నేను కాదనలేక, కొన్నాళ్ళైనా మీ దగ్గరుండే అవకాశం వచ్చింది కదా అని ఎంతో ఆనందంగా వచ్చాను. కానీ ఈ మూడునెలల్లో నాకర్థమైనదేమిటంటే మీదగ్గర ఎవరికోసం టైం లేదు, ఉండదు. అసలు మీ టైమే మీ చేతుల్లో లేదు. అందుకే, వెళ్ళిపోతున్నా. మీ తన్వి" అని.

చరిత్ర పునరావృతం అవడమంటే ఇదేనా? దాదాపు ఎనిమిదేళ్ళ క్రితం అనిత కూడా, ఇలాగే, "ప్లీజ్ డోంట్ టేక్ ఎనీవన్ ఫర్ గ్రాంటెడ్" అంటూ ఉత్తరం రాసి పెట్టి. అతని మనసంతా ఎవరో చెయ్యి పెట్టి కలచివేసినట్టయిపోయింది. తనకే ఎందుకు ఇలా అవుతోంది? తనేమీ చెడ్డవాడు కాదు.

మళ్ళీ బ్రతిమాలి తన్విని తీసుకుని రావచ్చేమో, కానీ ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని అతను ఊహించలేకపోవడమే అందుకు కారణం. అయినా అతని తండ్రి మనసు ఆక్రోశించింది. "తన్వీ ఎక్కడున్నావురా తల్లిగాడూ?" అంటూ.

"మురళీకృష్ణ గుంటూరు", ఎం.జీ గా పిలవబడే ప్రపంచ ప్రఖ్యాత మేనేజ్మెంట్ గురు. అతని నిక్ నేము కూడా మేనేజ్మెంట్ గురు (M.G) ని పొడక్షరాలుగా మారిస్తే ఎలా ఉంటుందో అలానే ఉండడం యాదృచ్ఛికమేనా అని చాలా మందికి సందేహం. అతి చిన్న వయసులోనే చాలా పేరు సంపాదించడానికి సహజసిద్ధమైన అతని తెలివి తేటలే కాదు, దాని వెనక అతని కష్ఠి, పట్టుదలా కూడా కారణం. అమెరికాలోని మిచిగన్ విశ్వవిద్యాలయంలోని ' స్టీఫెన్ రోస్ బిజినెస్ స్కూల్ లో' ప్రొఫెసర్ అతను. చిన్నప్పటినించీ చదువే లోకంగా పెరిగాడు, బ్రతికాడు.

ఇంతలో వచ్చిందో ఫోన్ కాల్. "మురీ"... ఒక్క అనిత మాత్రమే పిలిచే పిలుపది. "హనీ" అప్రయత్నంగానే అన్నాడు. అందరూ అనీ అని పిలిచే అనితని దానికి ముంది' హ' చేర్చి 'హనీ' అనే పిలిచేవాడు. అంతలోనే సర్దుకున్న అనిత,

" మురళీ, నిన్న రాత్రి తన్వి నాదగ్గరకి వచ్చింది, నేను అక్కడ ఉండను అంటోంది. తను ఇంటికి రాకపోతే కంగారుగా ఉంటుంది కదా అని ఫోన్ చేశాను. ఈజ్ ఎవిరీతింగ్ ఓకే? " ఆత్రుతగా అంది.

"థాంక్ గాడ్" అక్కడకే వచ్చింది కదా, నిన్న తను పంపిన మెసేజ్ నేను ఇప్పుడే చూశాను అనితా, ఏమయిందో తెలీదు, నిన్నటి వరకూ బాగానే ఉంది." అంటూనే, 'నిజంగా ఉందా? కనీసం ఉందో లేదో తనకి తెలుసా? ఎలా చెప్పగలిగాడు తను అలా' అనుకున్నాడు తనలోనే.

" పది నిమిషాల్లో నేను అక్కడ ఉంటాను, అడిగి కనుక్కోవచ్చు, తనున్న ఈ మూడు నెలలూ నాకెంతో బావుంది, నా దగ్గరే ఉండి మెడిసిన్ పూర్తి చేస్తుందనుకున్నాను" అన్నాడు.

"వద్దొద్దు, ఇప్పుడే నిద్రపోయింది, అవనీ, తనూ కలిసి డిన్నర్ చేశారు నేను వచ్చేసరికి. రేపు శుక్రవారం కదా, ఒక్కరోజు ఆగి, వీకెండ్ చూడవచ్చు" అంది.

ఒక్క నిమిషం ఆలోచించి" సరే !" అన్నాడు అంతకు మించి చేసేదేమీ లేక. కనీసం క్షేమం గా ఉందని తెలిసింది కదా అనుకున్నాడు ఆవేదనలోనే రవ్వంత ఆనందం. అంతేకాదు, చాలా దగ్గరలోనే ఉంటున్నా సరే ఇన్నేళ్ళ తర్వాత తనూ, అనితా, చాలాసేపు మాట్లాడుకున్నారు. అనిత గుర్తుకు రాగానే అతని మనసులోని బాధ రెట్టింపైంది.

"నాకే ఎందుకవుతోంది? ఇలా? నేనేం తప్పు చేశాను? ఆవేశంగా గుప్పిట బిగించి రెండో చేతిలో కొట్టుకున్నాడు.

గతమంతా నిన్ననే జరిగినట్టు కనిపిస్తోంది .

వివిధ రంగాలలో బేచులర్ డిగ్రీలు పూర్తి చేసుకుని, కళ్ళ నిండా మేనేజ్మెంట్ కలలతో ఐ.ఐ.ఎం అహమదాబాద్ లో అడుగుపెట్టే అనేకమంది విద్యార్థులలో మురళీ, అనితా కూడా ఉన్నారు. మురళి "ముంబై ఐ.ఐ.టీ " లో ఇంజనీరింగ్ చేసి వస్తే అనిత "అన్నా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్" నించి వచ్చింది.

తొలిరోజుల్లో జరిగిన ఒక క్లాస్ లో ప్రొఫెసర్ సరదాగా మాట్లాడుతూ, అందరినీ పరిచయం చేసుకున్నాకా "మీకందరికి ఒక చిన్న కథ చెప్తాను, చివరిలో ఒక ప్రశ్న వేస్తాను, చూద్దాం దానికి ఎవరెవరు ఏవిధంగా స్పందిస్తారో? " అన్నారు.

ఆయన పేరు "అనురాగ్ భట్నాగర్", చాలా మంచి ప్రొఫెసర్ గానూ, ముఖ్యంగా విద్యార్థులతో ఎంతో స్నేహంగా ఉండేవాడిగానూ అతనికెంతో పేరు.

విద్యార్థులంతా ఆసక్తి గా వినసాగారు.

" మీలో చాలామంది ఈ కథ వినేఉండవచ్చు, అయినా సరే చెప్తాను" అంటూ మొదలు పెట్టారాయన.

" ఒక ప్రముఖ అమెరికన్ వ్యాపార వేత్త హాలిడే ట్రిప్ కి మెక్సికో లోని ఒక ఫిషింగ్ గ్రామానికి వెళ్ళాడు, ఒక నాటి మధ్యాహ్నం అతను సముద్రం దగ్గర నడుస్తూ ఉండగా తన పడవ నిండా చక్కటి చేపలతో, ఎంతో సంతోషంతో సముద్రం మీదనించి వస్తున్న ఒక మెక్సికన్ బెస్త యువకుడిని చూశాడు. అతని సంతోషాన్ని గుర్తించి, మంచి వేట చేసినందుకు అతన్ని అభినందిస్తూ యధాలాపంగా అన్ని చేపలు పట్టడానికి అతనెకంత సమయం పట్టిందో అని అడిగాడు. దానికా యువకుడు వినయంగా "చాలా తక్కువ సమయం సార్! కొన్ని గంటల్లో నేను ఇంత వేట సంపాదించగలను" అన్నాడు గర్వంగా.

దానికి మన వ్యాపారవేత్త "నువ్వు మరికొంతసేపు సముద్రం మీద వేట చేస్తే ఇంకా ఎక్కువ చేపలొస్తాయి కదా?" అన్నాడు. దానికా యువకుడు ఆశ్చర్యంగా "ఇది నా కుటుంబ అవసరాలకి చాలు కదా, ఇంకా ఎక్కువ ఎందుకు?" అన్నాడు.

వ్యాపారవేత్త కూడా అంతే ఆశ్చర్యంగా "మరిరోజులో మిగతా కాలమంతా ఏం చేస్తావు?" అన్నాడు.

దానికా మెక్సికన్ యువకుడు " రాత్రి ఆలస్యంగా నిద్రపోతాను, పొద్దెక్కాకా లేస్తాను, నా పిల్లల్తో ఆడుకుంటాను, నా భార్యతో కలిసి స్నేహితులనీ, చుట్టాలనీ కలుస్తాను, గిటార్ వాయిస్తాను, " అంటూ లిస్ట్ చదవబోతుంటే చిరాకు పడుతూ.

" నీకు తెలియకుండానే నువ్వెంత సమయం వృధా చేస్తున్నావో నీకు తెలుస్తోందా? చూడు! నేనొక ప్రముఖ వ్యాపారవేత్తని, నీకు కావాలంటే సహాయం చెయ్యగలను. నీకు మంచి చేపలు పట్టే నేర్పుంది, నాకు చిన్న విషయాలనించి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించగలిగే తెలివుంది, మనిద్దరం కలిస్తే నువ్వు ఈ స్థాయి నించి ఎంతో గొప్ప స్థాయికి ఎదగవచ్చు "అన్నాడు బిజినెస్ మాన్.

"అంటే?" అడిగాడు అతని చిన్న ప్రపంచంలో అంత పెద్ద ఆలోచనని ఊహించలేని ఆ యువకుడు.

"అంటే మై ఫ్రెండ్! నీకు వివరంగా చెప్తాను" అంటూ, అతను ఎక్కువ చేపలు పట్టి, తనే అమ్ముకోవడం ద్వారా దళారీల బారి పడకుండా ఎలా కాపాడుకోవచ్చు ,ఆపైన తనే ఒక సంస్థ కి అధిపతి అయ్యి, చేపలు పట్టడం దగ్గరనించీ, వివిధ చోట్లకి సరఫరా అయ్యేదాకా కావలసిన సదుపాయాలన్నీ సమకూర్చుకుంటూ పెద్ద సంస్థ ని ఎలానిర్మించుకోవచ్చు , ఎలాదానికి అధిపతి కావచ్చు అన్నీ వివరించాడు.

అతని కళ్ళల్లో తనకోసం కదులుతున్న కలలని చూస్తూ అమాయకంగా అడిగాడా యువకుడు " దీనికంతటికీ ఎన్ని రోజులు పట్టవచ్చు సార్" అని.

" ఎంత? అయితే పదిహేను లేదా ఇరవై. అంతే, అప్పుడీ ప్రాంతానికంతా నువ్వు మకుటం లేని మహారాజువయిపోతావంటే నమ్ము" అన్నాడాయన తన మాటలు ఆ యువకుడిపై న కావలసిన ప్రభావాన్ని చూపిస్తున్నాయని గుర్తించిన ఆనందంతో.

" దాని తర్వాత?"

" ఓ వెర్రివాడా! దాని తర్వాతే ఉంది అసలు కథ, నువ్వా కంపెనీని ఎవరికైనా అమ్మేసి హాయిగా రిటైర్ అయిపోవచ్చు., అమ్మగా వచ్చిన మిలియన్ల డాలర్లతో జీవితం పూల పానుపులా మారిపోతుంది. నీకు కావలసినప్పుడు నిద్ర పోతావు, లేస్తావు, మనవలతో ఆడుకుంటావు, సరదాగా నీ భార్యతో, పిల్లలతో కావలసిన చోట్లన్నీ తిరుగుతావు, సినిమాలూ, ఆటలూ, పాటలూ. ఓహ్, స్వర్గమనుకో నీ జీవితం. " పరవశంగా చెప్పుకుంటూ పోతున్న ఆ బిజినెస్ మాన్ ని మధ్యలోనే ఆపి..

"కానీ నేను ఇప్పుడదే చేస్తున్నాను కదా సార్? అన్నాడు. ఆ యువకుడి ప్రశ్నలో అమాయకత్వం తప్ప శ్లేషామాత్రంగానైనా వ్యంగం లేదు.

ఆ తర్వాతేమయిందో తెలియదు కానీ చాలా మంది ఈ కథని తమ వృత్తి లేదా ఉద్యోగానికీ, సఫలతకీ, అన్వయించుకుంటూ చాలా విశ్లేషణలు చేశారు. నవయువతకి ప్రతినిధులైన మీరు దీనిగురించి ఏమంటారో వినాలని నా కోరిక. " అంటూ ఒక్క క్షణం ఆగి విద్యార్థుల ముఖాలవంక పరిశీలనగా చూసారాయన. హాలంతా నిశ్శబ్దం గా ఉంది.

" ముందు ఎవరు? " అడిగారాయన అదే చిరునవ్వుతో.

అందరూ రెప్పవేయకుండా ఆయన్నే చూస్తున్నారు. కథలోని ఈ రెండు పాత్రల్లో ఏదో ఒకదానిని సమర్థించక్కరలేదు మీరు. దేశ స్థాయిలో కష్టమైన పరీక్షల్లో ప్రముఖమైనదాన్ని పాసయి ఎన్నో కలలతో, ఆశలతో ఇక్కడకి వచ్చిన మీరు ఆ బెస్త యువకుడితో

ఏకీభవిస్తారని అనుకోలేను. మీలో రిజర్వ్ బేంక్ అధినేతలూ, ప్రపంచం గర్వించే రీతిలో ఎదగగలిగే మేనేజ్మెంట్ గురువులూ, దేశ విదేశాల్లో పెద్ద పెద్ద పదవులు అవలీలగా నిర్వహించగలిగే నవతరపు ప్రతినిధులూ కనిపిస్తున్నారు. అందుచేత మీరేమనుకుంటున్నారో మొహమాట పడకుండా చెప్పండి అన్నారాయన ప్రోత్సహిస్తున్నట్టుగా.

ఆ మాటతో అనిత లేచి నిలబడింది తెల్లగా, పొడవుగా ఉందామె, వీపంతా పరుచుకున్న మెత్తటి జుట్టు గాలికి మెల్లగా ఎగురుతోంది. " నా అభిప్రాయం, బెస్త యువకుడికి దగ్గరగానే ఉంది సార్ "అందినెమ్మదిగా.

ఆయన ఆశ్చర్యంగా చూశారు.

"నిజం సార్. అతనిలో నేను చూసినది లైఫ్ మేనేజ్మెంట్. అది మనకెవరూ నేర్పరు, మనకి మనంగా నేర్చుకోవాలి. మనం ఉండే సంఘంలో సఫలత అంటే మనం సంపాదించే డిగ్రీలు, తద్వారా వచ్చే ఉద్యోగపు హోదా, గడించిన డబ్బూ, కీర్తి ప్రతిష్టలూ వగైరా, వగైరా. ఇదే మన కథలోని వ్యాపారవేత్త అభిప్రాయం కూడా, కానీ బెస్తవాడి పరిధి చాలా చిన్నది, అందులో అతనికి సంతోషం ఉంది, సంతృప్తి ఉంది, కోరుకున్న జీవితం ఉంది, అందుకే ఇదే జీవితాన్ని తిరిగి ఎన్నో ఏళ్ళ తర్వాత చాలా డబ్బు గడించాక అనుభవించచ్చు అంటే అతనికి ఆశ్చర్యం వేసింది. ఇంతకంటే విభిన్నంగా ఉండని జీవితం కోసం అంత కష్టపడి జీవితంలో అన్ని విలువైన సంవత్సరాలు వేస్ట్ చెయ్యాలా? వేస్ట్ అని ఎందుకన్నానంటే ఈ కాలాంలో కొన్ని సాధించాలంటే ఎన్ని కోల్పోవాలో, కోల్పోతామో మనకి తెలియదు కనక.

ఇక్కడొక విషయం చెప్పాలి సార్. మనలో ఎవ్వరి పరిధీ కూడా ఆయువకుడి పరిధంత చిన్నది కాకపోవచ్చు కానీ ఒక పరిధంటూ గీసుకుని, దానికి గమ్యమూ, లక్ష్యమూ నిర్దేశించుకుని, తులనాత్మకంగా అడుగులు వేస్తూ నిర్దేశించుకున్న గమ్యాలని చేరుకుంటే జీవితాన్ని మన చేతిలోంచి జారిపోకుండా కాపాడుకోగలమని నా అభిప్రాయం. ఎంత సాధించాలో తెలిసినవాడే కాదు, ఎక్కడ చాలని శాసించుకోవాలో తెలిసినవాడే నిజమైన మనిషి అనుకుంటాను నేను. భెంజమిన్ ఫ్రాంక్లిన్ చెప్పినట్టు " డబ్బు మనిషిని సుఖపెట్టిన దాఖలాలు లేవు ఇప్పటివరకూ, ఇకపైన ఉండబోవు కూడా, ఎందుకంటే ధనార్తికి అంతు లేదు, కానీ అధికంగా ఉండడం వల్ల అది జీవితాల్లో ఏర్పడే శూన్యతని నింపదు సరికదా మరింత శూన్యాన్ని సృష్టిస్తుంది. అందుకనే ప్రణాళికా బద్ధంగా, పద్ధతిగా జీవితాన్ని గడపడాన్ని ఇష్టపడతాను నేను, మనమెంచుకున్న మార్గంలో పాతికేళ్ళ పరుగుపందెంపు మార్గంలో మనకు విజయం వస్తుందో రాదో తెలీదు, కానీ అది అందినా, లేకపోయినా స్పందిచడానికి, ఆ బాధనో, ఆనందాన్నో పంచుకోవడానికి మనదైన కుటుంబం ఉండడం అన్నింటికన్నా ముఖ్యం నాకు" అంది స్థిరంగా.

" వెరీ గుడ్. మీ అభిప్రాయం నాకు నచ్చింది, అభినందనలు " అన్నారాయన.

ఆమె అభిప్రాయం ఎలా ఉన్నా ఆమె చెప్పిన తీరు ఎందరినో ఆకట్టుకుంది. మురళితో సహా చాలా మంది బిజినెస్ మేన్ వైపే మాట్లాడారు.

మురళి ఐతే " యువకుడి పరంగా అతను చెప్పింది బాగానే ఉంది సార్, కానీ అందరూ అలాగే ఆలోచిస్తే ఇంక పురోగమనం జరిగేది ఎలా? సంస్థలూ, వ్యాపారాలూ ఏర్పడితేనే కదా ఉపాధి మార్గాలు పెరిగేవి, నిజానికి నిజాయితీగా, నియమ నిబద్ధతలతో వ్యాపారం చెయ్యగలిగితే అంతకంటే మించిన సంఘ సేవ మరొకటి లేదని నా అభిప్రాయం సార్, ఎందుకంటే ఎన్నో కుటుంబాలకి

జీవనోపాధి చూపించేదే నిజమైన పరోపకారం, కేవలం నేనూ, నా కుటుంబమూ అంటూ గిరి గీసేసుకుని ఆ చట్రంలో ఇమిడిపోతూ, ఇరుక్కుపోతే మన ప్రపంచం ఇంతమంది వ్యాపారవేత్తలని చూసేడా? ఇన్ని మహా వ్యాపార సామ్రాజ్యాల నిర్మాణం జరిగేదా? " అన్నాడు.

" వెరీ గుడ్ పాయింట్" అన్నారు ప్రొఫెసర్.

అలా ఒకే విషయం మీద విభిన్న అభిప్రాయాలతో స్పందించిన వారు విజాతి ధ్రువాలు ఆకర్షింపబడినట్టు తొలి సెమిస్టర్ లోనే ప్రేమలో పడిపోయారు.' ఇద్దరికీ ఏ ఒక్క విషయం లోనూ కలవదు. వీరిద్దరూ కలిసి ఎలా ఉంటారా?' అని స్నేహితులంతా ఆశ్చర్యపడ్డారు. ఇద్దరూ ఒకరికొకరు కాంప్లిమెంటరీగా ఉంటారు, అదీ మంచిదే అనుకున్నారు మళ్ళీ .

మురళి కెప్పుడూ చదువే లోకం, అన్ని పరీక్షలలోనూ మొదటి స్థానం వస్తేనే కానీ అతనికి కుదరదు, దానికోసం అహోరాత్రాలు చదివేవాడు, ఎప్పుడూ కొత్తగా ఏదైనా చేసి అందరికంటే ముందు ఎలా ఉండాలి? అనే ఆలోచించేవాడు. హార్వర్డ్ లో పీ.హెచ్. డీ చెయ్యాలనేది అతని చిరకాల కోరిక.

అనితకి చదువెంత ముఖ్యమో, తన మిగతా హాబీలూ, అలవాట్లూ కూడా అంటే ముఖ్యం. రోజూ అరగంట వ్యాయామం చెయ్యడం, ఒక అరగంటైనా తన వయోలీన్ వాయించుకోవడం ఆమె క్రమం తప్పకుండా చేసే పనులు. అందరితో సరదాగా ఉండడం ఆమెకెంతో ఇష్టం.

మురళి ఎప్పుడూ, చదువూ, ప్రోజెక్టులూ, పేపర్లూ అంటూ బిజీగా ఉండడంతో వారిద్దరూ కలిసి గడిపేందుకు ఎక్కువ సమయం దొరికేది కాదు. దానితో స్నేహితురాళ్ళు అనితని ఏడిపించేవారు.

"దొరక్క దొరక్క ఈ మునీశ్వరుడెలా దొరికాడే నీకు? ఇప్పుడే ఇలా ఉంటే రేపు పెళ్ళి అయ్యాకా ఎలా ఉంటాడో?" అని.

అనిత నవ్వేసేది ఆ మాటలకి. " మురళి చాలా మంచివాడు, తన లక్ష్యం హార్వర్డ్ చేరుకోవడం, అప్పటివరకూ అతన్ని డిస్టర్బ్ చేసే హక్కు నాకే కాదు, ఎవరికీ లేదు, నా బాధల్లా జీవితంలో పెద్ద లక్ష్యాలతో పాటు చిన్న చిన్న ఆనందాలని కూడా అతను మిస్ అవకూడదు అనే. " అనేది.

కలిసిన సందర్భాలలో అతను " సారీ హనీ, నిన్న ప్రొఫెసర్ తో కలిసి ఫలానా సంస్థకి మీటింగ్ కి వెళ్ళడం వల్ల నీకు ఇచ్చిన మాట నిలుపుకోలేకపోయాను, ఈ వీకెండ్ తప్పక వెళ్దాం " అంటే సరే అనేది, ఎప్పుడో ఒకసారి తప్ప గొడవ పెట్టేది కాదు.

" నీ వెర్రి కి, అనిత ఓపికే సరి రా, నీకు తనే సరి అయిన జోడీ " అనేవారు మురళి స్నేహితులు.

ఫైనల్ ఇయర్ లో కూడా మొదటి స్థానం లో నిలిచాడు మురళి. అతను కోరుకున్నట్టే హార్వర్డ్ లో పీ.హెచ్. డీ ప్రవేశాన్ని సాధించాడు. ఆ రోజే ఇద్దరూ తమ ఇళ్ళల్లో తమ ప్రేమని గురించి చెప్పారు. మురళి ఇంట్లో వాళ్ళు వెంటనే సరే అన్నారు, అనిత తండ్రి మాత్రం " అమ్మా నీది చాలా సున్నితమైన ప్రపంచం, హృదయం, దాన్ని అంతే అందంగా అతను చూసుకోగలడు అన్న నమ్మకం నీకుంటే సరే, లేకపోతే తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదు, నువ్వు జాగ్రత్తగా ఆలోచించుకుని నిర్ణయించుకో" అన్నారు.

తల్లి లేని అనితకి మొదటినించీ తండ్రి దగ్గరే చాలా చేరిక. " లేదు నాన్నా, మురళీ ఈజ్ ఏ గుడ్ గై, అంది".

పెళ్ళి కాగానే హార్వర్డ్ బిజినెస్ స్కూల్ కి ప్రయాణం. కేవలం రెండున్నరేళ్ళల్లో డాక్టరల్ థీసిస్ రాసి పట్టా అందుకున్న ప్రముఖ మేనేజ్మెంట్ గురు సీ.కే. ప్రహ్లాద్ గారి లాగా తానూ ఆ అరుదైన ఘనతని సాధించాలన్న తపన మొదలయింది మురళిలో. అందుకే హార్వర్డ్ లో చేరిన నాటినించీ అదే తపనగా ఉండేవాడు, అతని రీసెర్చి దానికి సంబంధించిన పనులలో అతను తలమునకలవుతూ ఉండడం వల్ల సహజంగానే ఇంట్లో అతను గడిపే సమయం తక్కువ అవసాగింది. అయినా అనిత బాధపడలేదు, ఆమెకి డాక్టరేట్ చెయ్యాలన్ని కోరిక లేదు అందుకని ఉద్యోగం లో చేరింది. పొద్దున్నే తెల్లారడమూ, సాయంత్రం సూర్యుడు అస్తమించడమూ మాత్రమే రోజులు గడవడం, అనుకుంటే మనకి తెలియకుండానే ఎన్నో రోజులు గడిచి పోతాయి ప్రపంచంలోని ఏ మూలైనా సరే.

"నువ్వు ప్రేమలో ఉంటే విషయాలన్నీ ఎంతో అర్థవంతంగా అనిపిస్తాయి " ( When you are in love things make more sense- Paulo Coelho in The Alchemist) అన్నప్రముఖ రచయత 'పాలో కోలో' మాటలని మనసారా నమ్ముతుంది అనిత, అందుకే మురళి ప్రవర్తనని చాలా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేది, దానికి తోడు మురళి స్వతహాగా మంచివాడు, అందుకే గడిపే కొద్ది సమయమూ చాలా అనునయంగా మాట్లాడేవాడు, పనిలో ఉన్నప్పుడు మాత్రం చిన్న ఫోన్ కాల్ చేసినా సరే, చాలా చిరాకు పడిపోయేవాడు, అది అనితని బాధించేది. అలా వారికి తెలియకుండానే ఇద్దరి మధ్యనా దూరం మొదలయింది.

" వాడు చిన్నప్పటినించీ అంతేనమ్మా, చదువులో పడితే ఇల్లూ, తిండీ ఏమీ తెలియదు, నువ్వే జాగ్రత్తగా చూసుకోవాలి" అనే అత్తగారితో ఏం చెప్పాలో తెలిసేది కాదు ఆమెకి. ఇంటి పనులూ, బయటి పనులూ అన్నీ తనే చేసుకోవలసి వచ్చేది. విపరీతమైన చలి, మంచు కురిసే వేళల్లో ఒంటరిగా ఇంట్లో భారంగా రోజులు గడుస్తుంటేనే అనిత కి తనకి తెలియకుండానే నిరాశ, నిస్తేజం ఆవరించడం మొదలయింది.

నాలుగైదు సార్లు మురళితో ఈ విషయం మీద వాదనకి దిగింది, దానికతను "అందరూ అనుకున్నట్టే నువ్వూ అనుకుంటే ఎలా అనితా, నా పీ.హెచ్. డీ అయిపోనీ, అప్పుడంతా ఇంట్లోనే" అన్నాడు నవ్వుతూ.

" మనం కాలేజీలో ఉన్నప్పుడు హార్వర్డ్ కి వెళ్ళే వరకూనే ఇంత కష్టపడటం, తరవాత ఇలా ఉండదు అనేవాడివి గుర్తుంది కదా?" అంది తనూ నవ్వడానికి ప్రయతినిస్తూ.

"సరేలే, ఎన్ని సార్లు చెప్తావు ఆ మాటలు? హార్వర్డ్ లో డాక్టరల్ డిగ్రీ ఊరికే చేతికిస్తారా? ఇదేం తొమ్మిది నించీ ఐదు వరకూ చేసే ఉద్యోగం కాదు కదా, ఆవిషయం నీకూ తెలుసు". పెళుసుగా అనేవాడు. " ఒకసారి నా డిగ్రీ రానీ, ప్రపంచమంతా మన ముంగిట్లోనే ఉంటుంది చూడు అనేవాడు కించిత్తు గర్వంతో. "

"ప్రపంచం ముంగింట్లో ఉంటే చాలా, గుప్పెడు ఆనందం జీవితంలో ఉండద్దూ?" అనిపించేది . వాదనని పెంచి ప్రయోజనం లేదని ఆమె అభిప్రాయం. అందుకే ఊరుకునేది.

మురళి మాత్రం తన పరిశోధన విషయాల్లో ఎంతో పురోగతి కనబరిచేవాడు, ప్రముఖమైన కాన్ఫరెన్స్ లకి చక్కటి పేపర్లు రాసి, వాటిని అధ్భుతంగా ప్రెజెంట్ చెయ్యడమూ, వివిధ జర్నల్లలో ప్రచురించబడటమూ అతనికీ, అతని ప్రొఫెసర్ కీ కూడా ఎంతో సంతోషాన్నిచ్చాయి.

"హనీ, నీకు తెలుసా? ఈ రోజేం జరిగిందో, నా పేపర్ ప్రెజెంటేషన్ ఎంత బాగా జరిగిందో! ఈ దెబ్బతో చాలా మంది కార్పోరేట్ సంస్థలు మాతో కలిసి పనిచెయ్యడానికి మా లాబ్ ముందు క్యూ కడతాయి తెలుసా? ఇంకొక్క సంవత్సరం కష్టపడితే నా థీసిస్ పూర్తి అయిపోతుంది, గురూజి కి మనం ఎక్కువ దూరంలో లేము " అన్నాడు సంతోషంగా. బయట మంచు కురుస్తోంది, అప్పుడే కార్ పార్క్ చేసి వచ్చిన అనిత అతనారోజు ఇంటికి తనకంటే ముందే రావడం చూసి సంతోషించింది.

"బయటకి భోజనానికి వెళదామా? "అని అడిగింది.

దానికతను వెంటనే "ఈరోజు కుదరదు అనితా, మా ప్రొఫెసర్ కి తెలిసిన ఒక కంపెనీ, బాగా నష్టాల్లో నడుస్తోందిట. దానికి సరి అయిన బిజినెస్ మోడల్ చూపించి సేవ్ చేసే ప్రయత్నంలో మాఇద్దరి సలహా కోరుతున్నారు. ఈ రోజు రాత్రి డిన్నర్ కి మొదటి ఇన్ ఫార్మల్ మీటింగ్. ఇది మాకు చాలా మంచి అవకాశం. మనం వీకెండ్ వెళ్దాం" అన్నాడు.

"ఏ వీకెండ్? ఈ సంవత్సరమేనా?" అనాలన్న కోర్కెని బలవంతాన ఆపుకుని విసురుగా లోపలకి నడిచింది.

'తను మురళిని పెళ్ళి చేసుకుని తప్పు చేసానా? ' అని ఈ మధ్యన అనితకి చాలాసార్లు అనిపిస్తోంది. అతన్ని తెలివితేటలనీ, కష్టపడే తత్వాన్నీ చూసే కదా ప్రేమించినది? ఇప్పుడు వాటినే తను ఇష్టపడటం లేదా? మురళి కేవలం ఇంటికీ, తనకే దక్కాలని తన స్వార్ధంగా ఆలోచిస్తోందా? అతని ఆశలూ, ఆశయాలు తనకంటే ఎవరికి బాగా తెలుసు? మరి తను ఎందుకిలా అనుకుంటోంది?' ఇలా సవాలక్ష ప్రశ్నలతో సతమతమవుతున్న తరుణంలోనే ఆమెకి తమ జీవితాల్లోకి మూడో మనిషి రాబోతున్నట్టు అర్ధం అయింది. ఈ సంగతి తెలిసి మురళి చాలా సంతోషించాడు. బాబు పుడితే' ప్రహ్లాద్ 'అని పేరు పెట్టుకుందామన్నాడు, పాపయితే అనిత ఇష్టం అన్నాడు. చాలా రోజుల తర్వాత వాళ్ళిద్దరి మధ్యనా నవ్వులు విరిశాయి. పాపయితే " ప్రహ్లాది" అని పెట్టుకుందామని అనిత అన్నప్పుడు. వాళ్ళకి కవలపిల్లలు పుట్టిన నాటికి మురళి థీసిస్ మొదలు పెట్టే విషయంలో బిజీగా ఉండేవాడు. "అవని, తన్వి" అని పేర్లు అనితే సూచిస్తే "నీ ఇష్టం వచ్చినట్టే చేద్దాం" అన్నాడు. మురళి వాళ్ళ అమ్మ మొదటి ఆరు నెలలూ ఉండి వెళ్ళింది.

కవలపిల్లలని పెంచడం ఎంత కష్టమో ఆవిడ వెళ్ళినతర్వాత అనితకర్ధం అయింది. మురళి రీసెర్చి మొదలయి మూడేళ్ళు కావస్తోంది, ప్రహ్లాద్ గారి రెండున్నరేళ్ళ టైము దాటిపోయిందని అతనికి విపరీతమైన అసంతృప్తిగా మొదలయింది.

" మూడేళ్ళకి అయిపోతుందిలే" అని అనిత ధైర్యం చెప్పబోతే కూడా చిరాకు పడేవాడు. మనిషికి అన్నీ సరిగ్గా సాగితే బానే ఉంటుంది, ఒత్తిడిలో కూడా సంయమనంగాఉండగలగడం ఎవ్వరికో గానీ సాధ్యం కాదు. అతనికి కోపం చాలా ఎక్కువయింది, అనితకీ ఆఫీస్ లోనూ, ఇంటిలోనూ పని ఒత్తిడి ఎక్కువయింది. ఒకప్పుడు ఎంతో సర్దుకుపోయిన అనిత ఇప్పుడలా చెయ్యలేకపోతోంది, పైగా అమెరికాలో అన్ని పనులూ సమానంగా చేసుకునే భార్యాభర్తలని చూసినప్పుడల్లా , తమ పరిస్థితి చూసుకుంటే ఆమెకి చాలా కష్టంగా అనిపించేది.

అతనికి డాక్టరేట్ వచ్చిన రోజు ఎంతో ఘనంగా సెలెబ్రేట్ చేశారు వాళ్ళు. పిల్లల పుట్టినరోజు కూడా కలిపి. అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరాడు మురళి.

"ఇకనించి ఓన్లీ పాఠాలు చెప్పేసి ఇంటికి వచ్చేయడమే, ఎప్పుడూ లేనిది నేను ఇంట్లో ఇంతసేపు ఉన్నానేమిటా? అని నువ్వే ఆశ్చర్యపోతావు" అన్నాడు డైమండ్ పొదిగిన ఉంగరం అనిత చేతికి తొడుగుతూ. అనితేమీ మాట్లాడలేదు.

"ఇలాంటివి ఇప్పటికి చాలా అయ్యాయి" అనుకుంది మనసులోనే. ఆమె అనుకున్నది నిజమే అయింది. అతని స్నేహితులు కొత్తగా కంపెనీ ప్రారంభిస్తూ అతన్ని సలహాదారుగా ఉండమన్నారు, అతను వెంటనే ఒప్పుకున్నాడు. అతని నేతృత్వంలో ఆ కంపెనీ తొందరలోనే అభివృద్ధి చెందడంతో అతనికి మరిన్ని అలాంటి ఆఫర్లు రావడం మొదలయింది. మళ్ళీ కథ మామూలే.

ఏదైనా అంటే " నువ్వే అర్థం చేసుకోకపోతే ఎలా?" అన్న మాటలు విని విసిగిపోయింది అనిత. " తన మాట ఎవరు వింటారు? తననెవరు అర్థం చేసుకుంటారు?, " అనుకుంది. ప్రతీ నాలుగు రోజులకీ గొడవ పడే ఓపికా, తీరికా లేవు ఆమెకి.

" నీకు గుర్తుందా? నీది బెస్ట యువకుడి రూట్ అన్నావు కదా, వై డోంట్ యూ టేక్ ఏ బ్రేక్ అంత కష్టంగా ఉంటే, నేను సంపాదిస్తు న్నాగా, చాలదా మరి? " అన్నాడు మురళి ఒకసారి ఎద్దేవా చేస్తున్నట్టుగా.

దాంతో అనిత అభిమానం బాగా దెబ్బతింది. "ఇలా ఎన్నాళ్ళు?" అనుకుంటేనే ఆమెకి బాధగా ఉంది. ఎన్నాళ్ళో తొందరలోనే తెలిసింది ఆమె. ఒకసారి అర్జంట్ పనిమీద పిల్లలతో బయటకు వెళ్ళిన అనిత అనుకోకుండా మంచులో హైవే మీద చిక్కుకుపోయింది. కార్ చెడిపోయింది, విపరీతంగా కురుస్తున్న మంచు, చలి. దారిలోనే కార్ వదిలేసి దగ్గరలో ఉన్న డిపార్ట్ మెంటల్ స్టోర్ లో తలదాచుకున్నారు, మురళి కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా దొరకలేదు. అర్జంట్ పనిమీద పొరుగు రాష్ట్రానికి వెళ్ళిన అతను ఒక ముఖ్యమైన కేస్ చదువుతూ, ఏ విధమైన అంతరాయం లేకుండా ఉండాలని ఫోన్ సైలెంట్ లో పెట్టుకోవడంతో అనిత ఫోన్ చేసిన సంగతి మర్నాడు పొద్దున్న వరకూ అతనికి తెలియలేదు. మర్నాడు మంచు కొంచం తగ్గిన తర్వాత అధికారుల సహాయంతో అనితా, పిల్లలూ ఇంటికి చేరారు..

ఎక్కువ వాదోపవాదాలకి తావివ్వకుండానే అనిత అతనికొక ఉత్తరం రాసి పెట్టి పిల్లలిద్దరినీ తీసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోయింది. మురళి చాలా అప్సెట్ అయ్యాడు ఈ వార్త తెలిసి. తన ఆఫీసుకు దగ్గరగా ఒక అపార్ట్మెంట్ అద్దెకి తీసుకుని ఉంటోందని తెలిసి వెళ్ళి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. "మనమేమీ లీగల్ గా విడిపోలేదు కదా మురళీ, కొన్నాళ్ళు విడిగా ఉంటే కనీసం మన మధ్యన ఆనాటి భావనలు తిరిగి చిగురిస్తాయేమో నని నా ఆశ, ఇక్కడకి నువ్వెప్పుడు రావాలన్నా రావచ్చు. మాతో ఉండచ్చు, " అంది.

చేసేదేమీ లేక వెనక్కి వచ్చేశాడు. అలా అయినా అతను కొద్దిగా తన పనులు తగ్గించుకుని కుటుంబానికి దగ్గరవడానికి ప్రయత్నిస్తాడేమోనని అనిత ఆశపడింది. పనిలో పడితే నిద్రా, తిండీ కూడా గుర్తు రాని అతనికి మనసులో కోరిక ఉన్నా సరే కుదిరేది కాదు. దానివల్ల పెరిగిన దూరం అలాగే ఉంది తప్ప దగ్గరవలేదు. వాళ్ళిద్దరూ ఎంతో ఇష్టపడి కొనుక్కున్న ఏడు బెడ్రూం ల ఇల్లు ఇప్పటికీ తన యజమానురాలి రాకకోసం ఎదురుచూస్తూనే ఉంది. అవనీ, తన్వీ బాగానే చదువుకుంటున్నారు.

అవని లాయర్ కావాలని నిర్ణయించుకుంది, తన్వేమో డాక్టర్ కావాలని అనుకుంటోంది. ఈ మధ్యలో వారి స్నేహితులు వారిని కలిపే ప్రయత్నాలు చేసినా సరే అనిత ఒప్పుకోలేదు, అతనిలో ఆమె కోరుకున్న మార్పు రాలేదని ఆమెకి తెలుసు. ఈఎనిమిదేళ్ళలో అనిత

తను పని చేసే కంపెనీ కి వైస్ ప్రెసిడెంట్ అయింది. మురళి అనేక పుస్తకాలూ, పేపర్లూ, కంపెనీల సలహాదారునిగా ఎంతో ఎత్తుకి ఎదిగాడు. అతని టైము అతని చేతిలో ఉండనంత ఎత్తుకి.

ఇన్నేళ్ళలో పిల్లలని మహా అయితే పది, పన్నెండు సార్లు కలిసి ఉంటాడేమో. వాళ్ళ 'గ్రాడ్యుయేషన్ డే' కి మాత్రం అతి కష్టం మీద వెళ్ళగలిగాడు.అప్పుడే తెలిసింది తన్వి కి తన ఇంటి దగ్గరలో ఉన్న మెడికల్ స్కూల్ లో సీటు వచ్చిందని. తన్వి తన దగ్గరకొచ్చి ఉండవచ్చు, ఎక్కువ డ్రైవ్ చెయ్యవలసిన అవసరం ఉండదు అని అనితతోనూ, పిల్లలతోనూ అన్నాడు. సాధారణంగా ఆడపిల్లలకి తండ్రి మీదుండే ప్రేమతో, నాన్నదగ్గర ఉండవచ్చు అన్న ఆనందంతో తన్వి కూడా వెంటనే ఒప్పుకుంది. అది జరిగి, ఆ పిల్ల ఇంటికి వచ్చిన మూడు నెలల్లోనే వెళ్ళిపోయేసరికి ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు ఏం.జీ కి.

మళ్ళీ ఒకసారి కూతురు పంపిన మెసేజ్ చదువుకున్నాడు." మీదగ్గర ఎవరికోసం టైం లేదు, ఉండదు. అసలు మీ టైమే మీ చేతుల్లో లేదు. అందుకే, వెళ్ళిపోతున్నా. మీ తన్వి". క్లుప్తంగానే అయినా ఎక్కడ తగలాలో అక్కడ తగిలేట్టు వెక్కిరిస్తున్నాయి ఆ వాక్యాలు.

అప్పుడొచ్చిందతనికి ఆపుకోలేనంత దు:ఖం. చేతుల్లో ముఖాన్ని దాచుకుని చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు. ఫార్మల్ లివింగ్ రూం నిండా అనేక అరల్లో పొందిగ్గా అమర్చి ఉన్న అవార్డ్ లు కానీ, అత్యంత ఎక్కువగా పేర్కొనబడినవిగా ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన అతని పేపర్లు కానీ, అతని సలహాల వల్ల నష్టాల ఊబిలోంచి లాభాల బాట పట్టిన ఎన్నో కంపెనీలు కానీ, "యూ ఆర్ ఏ బోర్న్ జీనియస్ వి రా" అంటూ పొగుడుతూ తన వెన్ను తట్టే మిత్రులు కానీ, తను పోగుచేసుకున్న ఆస్థిపాస్థులు కానీ, ఇవేవీ, ఏవీ .. తీర్చలేని దు:ఖం అది.

ఎంతసేపున్నాడో తెలియకుండా అలాగే చేతుల్లో ముఖం దాచుకుని ఉండిపోయాడు. మనసులోపలి పొరల్లోంచి ఘనీభవించిన భావనలన్నీ కరిగి నీరవుతూ అతని కన్నీళ్ళుగా ప్రవహిస్తున్నాయి. "ఎప్పుడో అనిత చెప్పిన మాట ఎంత నిజం, కాలేజీల్లో బిజినెస్ మేనేజ్మెంట్ పాఠాలు నేర్పుతారు కానీ లైఫ్ మేనేజ్మెంట్ మాత్రం ఎవరికి వారు నేర్చుకోవాలి " అని పదే పదే అనుకోసాగాడు.

మనసులో దిగులంతా కన్నీళ్లతో కడిగాకా నిర్ణయించుకున్నాడు వెంటనే అనితనీ, పిల్లలనీ కలిసి మాట్లాడాలనీ, మనసు పంచుకోవాలనీ. బిజినెస్ మేనేజ్మెంట్ నించి లైఫ్ మేనేజ్ మెంట్ వైపు అతను వేయబోయే తొలి అడుగులేమో అవి మరి.

Click here to share your comments on this story